క్లుప్తంగా

మాజీ ఉపరాష్ట్రపతికి స్వాగతం



రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి జిల్లా రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం ఉదయం హైదరాబాదు నుంచి రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకి బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

శ్రీకాళహస్తిలో రద్దీ



రాహుకేతు పూజలు చేసుకుని బయటకు వస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: వరుస సెలవులతో శ్రీకాళహస్తీశ్వరాలయం భక్త జన సంద్రంగా మారింది. ఇక్కడి ఆలయంలో శనివారం రాహు, కేతు సర్ప దోష నివారణ పూజలను చేయించేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు. వేసవి దష్ట్యా తగినన్ని తాగునీరు అందుబాటులో లేకపోవడంతో భక్తులు ఇబ్బందిపడ్డారు. వేసవి ప్రభావంతో భక్తులకు ఉక్కపోత కష్టాలు తప్పలేదు. రాహు, కేతు పూజల్లో 5188 మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే సమయానికి దాదాపు పాతికవేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని అధికారులు చెబుతున్నారు.

ఘనంగా హనుమజ్జయంతి



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజుల పెళ్లూరు, కంచనపుత్తూరు, జోగికండ్రిగ, కల్లివెట్టు, పల్లమాల, నీర్పాకోట గ్రామాల్లో శ్రీహనుమాన్ జయంతిని శ్రీఅంజనేయ స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామాల్లోని దేవాలయాల్లో సీతారాముల విగ్రహాలకు అభిషేకాలు చేసి పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీఅంజనేయస్వామి విగ్రహానికి అభిషేకాలు చేసి పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీఅంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామాల్లో ఊరేగించారు. అన్నదానం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. గ్రామాల్లో శ్రీహనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


అదుపుతప్పిన లారీ



కరుణానది వంతెనపై ఇరుక్కున్న కంటైనర్ లారీ

వరదయ్యపాళెం: తడ-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలోని కడూరు సమీపంలోని కరుణానది వంతెనపై భారీ కంటైనర్ లారీ ఇరుక్కుపోయింది. శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనతో వాహన రాకపోకలకు గంటపాటు అంతరాయం ఏర్పడింది. శ్రీసిటీ నుండి శ్రీకాళహస్తి వైపుగా కంటైనర్ లారీ వెళ్తుండగా కరుణానది వంతెన వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తులో జారుకోవడంతో వాహనం అదుపు తప్పి వంతెన పిట్టగోడను ఢీకొనింది. దీంతో వాహనం ముందు భాగంలోని ఓ చక్రం పిట్టగోడ అవతలివైపునకు వెళ్లడంతో వంతెనకు అడ్డంగా ఇరుక్కుపోయింది. దీంతో వంతెన మీదుగా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో సమాచారం అందుకున్న ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం క్రేన్ సాయంతో కంటైనర్ లారీని వెలికి తీసి రాకపోకలను పునరుద్ధించారు. అయితే వంతెన పిట్టగోడ చాలా వరకు దెబ్బతినింది.

ముగిసిన పెద్ద కొట్టాయి ఉత్సవం



పట్టణంలో ఊరేగుతున్న స్వామి అమ్మవారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పెద్ద కొట్టాయి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద కొట్టాయి ఉత్సవం శనివారంతో పరిసమాప్తమైంది. ఈ నేపథ్యంలో స్వామి అమ్మవారికి అలంకార మండపంలో ప్రత్యేకంగా అలంకరించి పంచ హారతులు సమర్పించి ఉత్సవం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవారికి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.



త్రిమూర్తులకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు



కల్యాణ వేదికపై ముస్తాబైన త్రిమూర్తులు

త్రిమూర్తుల కల్యాణ మహోత్సవం

- లోక కల్యాణానికి శ్రీకారం
- చైత్ర పౌర్ణమి అమృత ఘడియల్లో మాంగల్య ధారణ
- త్రిమూర్తుల కల్యాణానికి తరలివచ్చిన భక్తజనం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): స్వర్ణముఖి నది తీరాన వెలసిన ప్రాచీనమైన శివాలయాల్లో ప్రముఖమైన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర ఆలయంలో అత్యంత వైభవంగా త్రిమూర్తుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రేణిగుంట మండలం గాజులమండ్యంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర ఆలయంలో ఏకవీర సేవా ఫౌండేషన్, సురభి గో సంరక్షణ శాల, ఆలయ నిర్వాహకులు జువ్వల ధనంజయ రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య వేద పండితుల వేదమంత్రాల నడుమ త్రిమూర్తుల కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. ఈ మహోత్సవాన్ని భక్తులు అధిక సంఖ్యలో కనులారా వీక్షించి తరించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలకు ఆలయ నిర్వాహకులు పసుపు దారాలు, పసుపు కుంకుమలను పంపిణీ చేశారు. ప్రతాప్ స్వామీజీ మాట్లాడుతూ చైత్ర పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణమే పరమావధిగా త్రిమూర్తుల కల్యాణ మహోత్సవాన్ని భక్తుల నడుమ నిర్వహించామన్నారు. ఎంపీపీ హరి ప్రసాద్ రెడ్డి కల్యాణ మహోత్సవాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జగదీశ్వర్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



త్రిమూర్తుల ముందు ఉన్న కలశాలు

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయొద్దు

వరదయ్యపాళెం: రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తున్నారని వరదయ్యపాళెం ప్రెస్‌క్లబ్ కార్యదర్శి గుత్తి త్యాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత చర్యలను జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. పల్నాడు జిల్లాలో ఓ హత్యకు సంబంధించి వాస్తవాలను వార్తగా ప్రచురించినందుకు సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డితోపాటు ఆరుగురు జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద పాత్రికేయులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సామర్ల హరి, జర్నలిస్టులు ఉమామహేష్, గుత్తి త్యాగరాజు, పాల్ మహేష్, శేఖర్, ప్రశాంత్, రమేష్, నాగార్జున, ఇళయరాజా, బాబు, యువరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వరదయ్యపాళెం జర్నలిస్టులు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు

వరదయ్యపాళెం: అమ్మాభగవాన్ సేవా ట్రస్టుకు చెందిన లోకా ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇస్తున్న తోడ్పాటు అభినందనీయమని వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ మండల విద్యాశాఖ అధికారులు గున్నయ్య, మునిసుబ్రమణ్యం తెలిపారు. శనివారం సాయంత్రం గోవర్ధనపురంలోని లోకా ఫౌండేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఆ సంస్థకు చెందిన విద్యా విభాగం వార్షికోత్సవం నిర్వహించారు. లోకా ఫౌండేషన్ సభ్యులు లోకేష్ దాసాజీ, సునీల్ దాసాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి 2 మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ట్రస్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు, విద్యార్థులు హాజరయ్యారు. లోకేష్ దాసాజీ మాట్లాడుతూ.. ట్రస్టు ద్వారా వేతనాలు చెల్లించి ఉపాధ్యాయులు కొరత ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో వలంటీర్ సేవలు కొనసాగిస్తున్నామన్నారు. అలాగే సాయంత్రం పూట గ్రామాల్లో ట్రస్టు ద్వారా వలంటీర్లను ఏర్పాటు చేసి ట్యూషన్లు నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. అంతేకాక రెండు మండలాల్లో లక్షలాది రూపాయిల వ్యయంతో పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటునిచ్చినట్లు ఆయన వివరించారు. అనంతరం విద్యా విభాగం ఇన్‌చార్జి హరిగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ట్రస్టు నుండి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇస్తున్న ప్రోత్సాహం వెలకట్టలేనిదని కొనియాడారు. రెండు మండలాల ఉపాధ్యాయినీఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టెలికాం బోర్డు మాజీ సభ్యుడు సుందర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు బందిల కుమార్, ముద్దుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లోకా ఫౌండేషన్ విద్యా విభాగం వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న ట్రస్టు సభ్యులు లోకేష్ దాసాజీ

ఆదమరిస్తే అంతే సంగతులు

వరదయ్యపాళెం: గ్యాస్ పైపులైను కోసం రోడ్ల అంచున తీస్తున్న గోతులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. కనీస భద్రతా ప్రమాణాలు లేకుండా తవ్వకాలు జరుపుతుండడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు ఆనుకుని చేపడుతున్న ఈ తవ్వకాలు పైనుంచి కనీసం అడుగుల లోతు మేరకు కాలువ తీస్తున్నారు. రాత్రివేళల్లో ఆదమరిచి రోడ్డు మీద నుండి 2 అడుగులు పక్కకు వెళ్లితే ఇక అంతే సంగతులు. కాలువలో పడి ప్రమాదానికి గురవ్వాల్సిందే. ఈ పరిస్థితి శ్రీసిటీకి వెళ్లే మార్గంలో చెరివి విద్యుత్ సబ్ స్టేషన్ నుండి శ్రీసిటీ సబ్ స్టేషన్ వరకు వెళ్లే సింగిల్ రోడ్డు మార్గంలో నెలకొంది. అసలే ఈ మార్గం ఒకే వాహనం వెళ్లే విధంగా సింగిల్ రోడ్డు ఉంది. ఈ మార్గం గుండా రోజువారీ వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, భారీ లారీలు వెళ్తుంటాయి. ఇంత చిన్న రోడ్డు మార్గంలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అటు స్థానికులు, ఇటు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాత్రివేళల్లో పైపులైను కోసం తీసిన గోతిని గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్, వారి సిబ్బంది ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. అయితే దీన్ని నియంత్రించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం తమకేమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.



శ్రీసిటీకి వెళ్లే మార్గంలో చెరివి సబ్ స్టేషన్ వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుకు ఆనుకుని పైపులైను కోసం తీసిన కాలువ

ల్యాబ్ టెక్నీషియన్‌కు న్యాయం చేయండి

నారాయణవనం: నెల్లూరు జిల్లా జలదంకి పీహెచ్‌సీలో పనిచేసిన కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్ రసూల్‌కు ఆపేసిన 18 నెలల జీతాన్ని మంజూరు చేసి న్యాయం చేయాలని ఏపీ ల్యాబ్ టెక్నీషియన్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు, నారాయణవనం పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ రమేష్‌బాబు డిమాండ్ చేశారు. జిల్లా యూనియన్ నాయకులు తులసీరాం, సిద్ధారెడ్డి, అరుణ్‌ప్రసాద్, బాలాజీలతో కలిసి శనివారం మీడియాతో రమేష్‌బాబు మాట్లాడారు. జీతం చెల్లించకుండా రసూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం మానసికంగా వేధించడం సరికాదని అన్నారు. రసూల్‌ను మరో పీహెచ్‌సీకి బదిలీ చేసి బకాయి పడిన జీతాన్ని తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మే డే స్ఫూర్తితో ముందడుగు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మే డే స్ఫూర్తితో కార్మికుల కనీస వేతనం కోసం పోరాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. రేణిగుంట పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశాన్ని పి.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనరల్ బాడీ సమావేశంలో పలు అంశాలపై చర్చించి, ఆమోదించారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల అధ్యక్షుడిగా సెల్వరాజ్, ప్రధాన కార్యదర్శిగా హరినాథ్, 23 మందితో నూతన కమిటీని ఎన్నుకుని సమావేశంలో ఆమోదించారు. అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ మే 1న ప్రపంచ కార్మికుల ఐక్యతకు స్ఫూర్తిగా 8 గంటల పని విధానం సాధించుకున్న హక్కుల రోజుగా ఎర్రజెండా ఎగురవేసి మేడే సంబరాలు కార్మికులు జరుపుకుంటారని అన్నారు. నూతన కమిటీ సభ్యులు కార్మికుల సమస్యలపై నిత్యం పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, సీఐటీయూ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య

వైభవంగా కల్యాణోత్సవం



కంచరపాళెంలో శ్రీకాశీవిశాలాక్షి విశ్వనాథుని కల్యాణోత్సవం

వరదయ్యపాళెం: మండలంలోని కంచరపాళెంలోని శ్రీపేరంటాలమ్మ ఆలయం వద్ద శ్రీకాశీవిశాలాక్షి విశ్వనాథస్వామి కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం జరిగిన ఈ కల్యాణ వేడుకకు పెద్దఎత్తున గ్రామస్తులు, పరిసర ప్రాంత భక్తులు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం, రేవతి దంపతులు ఉభదారులుగా వ్యవహరించారు. అర్చకులు శంకరస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. ఉపసర్పంచ్ సుమతి తులసీరామ్ దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల హవా



ఆర్.రజిత | పి.లక్ష్మి, ఎం.రెశ్వంత్ రావు | కె.లక్ష్మీప్రసాద్ | జాహ్నవి | భాను | గురమ్మ | దమయంతి | లతశ్రీ | సంధ్య

మహదీప్ | శిరీషా | విజయ్‌కుమార్ | మునిపూజిత | నందిని | వంశీ | గౌతమి | పావని | మానస | కుమారి

రతి | తేజశ్రీ | మునిలక్ష్మి | హేస్మిత | జ్యోత్స్న | హేమ | లోకేశ్వరి | కావ్య | మీన

నాగలాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి అందరి మన్ననలు పొందుతున్నారు. బైపీసీలో మొదటి సంవత్సరం చదువుతున్న లక్ష్మి 400/440, సీఈసీలో పద్మప్రియ 423/500, వొకేషనల్‌లో 447/500, ఎం.రెశ్వంత్ రావు 908/1000 మార్కులు సాధించారు. మొదటి శాతం 87.50 శాతం, రెండవ సంవత్సరం 87.84 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు.

సత్తా చాటిన లక్ష్మీప్రసాద్

సత్యవేడు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలలో సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థి కె.లక్ష్మీప్రసాద్ 1000 మార్కులకు 981 పొంది మండల టాపర్‌గా నిలిచాడని ప్రిన్సిపల్ బి.అనిల్‌కుమార్ తెలిపారు. కళాశాల పరిధిలో 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీ 100శాతం, బైపీసీ 90శాతం, సీఈసీ 100 శాతం, హెచ్ఈసీ 100 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

సత్తా చాటిన విద్యార్థినులు

బుచ్చినాయుడుకండ్రిగ: జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. ఈ సంవత్సరం నుండి ఎంపీసీ, బైపీసీతోపాటు ఎంబైపీసీ గ్రూప్‌ను కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపీసీలో జాహ్నవి 920, భాను 834, గురమ్మ 763, బైపీసీలో దమయంతి 775, లతశ్రీ 691 మార్కులు సాధించారని తెలిపారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 68.9 శాతం, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 58.4 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 74 మంది గాను 51 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 65 మంది విద్యార్థులకు 38 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె వివరించారు.

కాలేజ్ టాపర్లు

ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కాలేజ్ టాపర్‌గా బైపీసీ విభాగానికి చెందిన ఎం.సంధ్య (928), ఎంపీసీ విభాగానికి చెందిన ఆర్.మహదీప్ (925), సీఈసీ విభాగానికి చెందిన వి. శిరీషా (770) మార్కులు సాధించారు. అలాగే మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో జె. విజయ్ కుమార్ (443), బి.మునిపూజిత (443), బైపీసీలో జి.నందిని (413), సీఈసీ విభాగానికి చెందిన టి.వంశీ (376) మార్కులు సాధించి కాలేజ్ టాపర్లుగా నిలిచారు.

మెరిసిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ఏర్పేడు (రేణిగుంట): ఇంటర్ ఫలితాల్లో ఏర్పేడు మండలం పాపానాయుడుపేట జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ జీ.వి.ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో కే.గౌతమి 969, ఆర్.పావని 965, ఏ.మానస 963 మార్కులు సాధించాలన్నారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో వి.కుమారి 420, ఎన్ జగదీష్ 418, ఏ సుస్మిత 413 మార్కులు సాధించాలని చెప్పారు.

జెడ్పీ బాలికల హైస్కూల్లో ఉత్తమ ఫలితాలు

శ్రీకాళహస్తి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో జెడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరంలో బైపీసీలో రతి 440కి గాను 414 మార్కులు సాధించింది. ఎంపీసీలో తేజశ్రీ 470 గాను 397 మార్కులు సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మునిలక్ష్మి 1000 మార్కులకు గాను 899 మార్కులు సాధించింది. సీనియర్ బైపీసీలో తిరు మల్లేశ్వరి 1000 మార్కులకు గాను 911 మార్కులు సాధించింది.

బాలికల ప్రభంజనం

నారాయణవనం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. 46 మంది హాజరు కాగా 28 మంది ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం శశికళ తెలిపారు. ద్వితీయ ఎంపీసీలో హేస్మిత(975), జ్యోత్స్న(967), హేమ(948), బైపీసీలో లోకేశ్వరి (954), కావ్య (950), మీనా (943) టాపర్లుగా నిలిచారు. తొమ్మిది మంది బాలికలు 900 పైగా మార్కులు సాధించారని అన్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో హేమలత (426), సుష్మ (413), రోహిణి (407), బైపీసీలో దివ్య (373) చరిష్మా (332), ఢిల్లీ రాణి (321) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

గిరిజన గురుకులాల్లో అత్యుత్తమ ఫలితాలు

శ్రీకాళహస్తి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2007లో గిరిజన బాలికల కోసం ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఎక్సలెన్సీ గురుకులాలు గిరిజనుల భవిష్యత్తుకు ఆశాజనకంగా మారాయి. ఆ రోజు ఆయన నాటిన చెట్లు ఈ రోజు ఫలితాలు ఇస్తున్నాయి. శ్రీకాళహస్తి పట్టణం రాజీవ్ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఎక్సలెన్సీ గురుకుల కళాశాల విద్యార్థులు బైపీసీలో 33 మంది ఎంపీసీలో 36 మంది మొత్తం 69 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందరూ 750 మార్కులకు పైగా సాధించారు. ఈ ఉత్తమ ఫలితాల విషయమై ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ 28 మందికి 900కంటే ఎక్కువ మార్కులు రావడం సంతోషకరమని ఆయన తెలిపారు. కదిరికి చెందిన పావని బాయ్ బైపీసీలో 982 మార్కులు సాధించింది.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, పావని భాయ్

చలివేంద్రం ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు టూ టౌన్ సీఐ వెంకటేశులు తెలిపారు. ముఖ్యంగా వేసవి తాపం ఎక్కువగా ఉండడంతో ఈ మార్గంలో వెళ్లే వారికి చల్లని మంచినీటిని అందించాలన్న ఉద్దేశంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పక్షుల దాహార్తిని తీర్చేందుకు పోలీస్ స్టేషన్‌తోపాటు, మరి కొన్ని ప్రాంతాల్లో చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం ఈ మార్గంలో వెళ్లే మహిళలు చిన్నారులకు ఆటో డ్రైవర్లకు చల్లని నీటితో పాటు మజ్జిగను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐతో పాటు ఏఎస్ఐ షణ్ముగం, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశులు

వైఎస్ఆర్ సీపీ నేతకు ఘన నివాళి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ యూత్ నాయకుడు సుబ్రమణ్యం (35) శుక్రవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఈయన మృతదేహానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కన్వీనర్ కొనతనేని మణినాయుడు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, జిల్లా కార్యదర్శి గోపాల్‌రెడ్డి, స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి గురునాథం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్